సాక్షి
శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు
మంగళవారం । 7 । జనవరి । 2025



సోమశిలలో 71.562 టీఎంసీలు

సోమశిల: జలాశయంలో సోమవారం 71.562 టీఎంసీల నీరుంది. పైతట్టు ప్రాంతాల నుంచి 2781 క్యూసెక్కుల వరద ప్రవాహం వచ్చి చేరుతోంది.



బంగారం ధరలు

24 క్యారెట్లు (10 గ్రా)	రూ.79,,350
22 క్యారెట్ల ఆర్నమెంట్ (గ్రా)	రూ.7,207
3 శాతం జీఎస్టీతో	రూ.7,423
నవర (8 గ్రా)	రూ.59,384

గరిష్టం/కనిష్టం
29.3 /21.5

వాతావరణం

జిల్లాలో మంగళవారం వాతావరణం సాధారణంగా ఉంటుందని ఆ శాఖ అధికారులు తెలిపారు. గాలిలో తేమ సోమవారం 74 శాతంగా నమోదైంది.

న్యూస్‌రీల్

500 బస్తాల బియ్యం స్వాధీనం



దగదర్తి పోలీస్ స్టేషన్‌లో ఉన్న లారీ

దగదర్తి(కావలి): దగదర్తి మండలం అల్లూరు రోడ్డు సమీపంలో ఎటువంటి రికార్డులు లేకుండా తరలిస్తున్న సుమారు 500 బస్తాల బియ్యాన్ని పోలీసులు సోమవారం స్వాధీనం చేసుకున్నారు. ఎస్సై జంపాని కుమార్ తనిఖీల్లో భాగంగా బియ్యం తరలిస్తున్న లారీని గుర్తించి స్వాధీనం చేసుకున్నారు. బియ్యానికి సంబంధించి ఎటువంటి రికార్డులు లేకపోవడం, రేషన్ బియ్యంగా అనుమానాలు వ్యక్తమవడంతో లారీని, బియ్యం బస్తాలను సీజ్ చేసి స్టేషన్‌కు తరలించారు. రెవెన్యూ, పౌరసరఫరాలశాఖ అధికారులకు సమాచారం ఇచ్చారు. ఉదయం 9 గంటల ప్రాంతంలో బియ్యం లారీని సీజ్ చేసినా సాయంత్రం వరకూ కూడా రెవెన్యూ, పౌరసరఫరాల శాఖ అధికారులు పరిశీలించినట్లు ఎటువంటి సమాచారం లభించలేదు. మరో వైపు కందుకూరుకు చెందిన ఓ కీలక నేతకు చెందిన బియ్యంగా సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. ఉమ్మడి ప్రకాశం, గుంటూరు జిల్లాల నుంచి నెల్లూరు మీదుగా చెన్నైకు తరలిస్తున్న రేషన్ బియ్యంగా మెసేజీలు చక్కర్లు కొట్టాయి. అధికారులు మాత్రం పూర్తి గోప్యత పాటిస్తున్నారు.

రేపు యువ ఉత్సవ్ పోటీలు

నెల్లూరు(అర్బన్): నెహ్రూ యువకేంద్రం ఆధ్వర్యంలో ఈనెల 8న బుధవారం నగరంలోని పురమందిరం (టౌన్‌హాలు)లో యువ ఉత్సవ్ పోటీలు నిర్వహిస్తున్నామని జిల్లా యువజన అధికారి ఎ.మహేంద్రరెడ్డి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. యువతీ, యువకులకు వక్తృత్వ, సైన్సు ఎగ్జిబిషన్, వ్యాసరచన, మొబైల్ ఫొటోగ్రఫీ, డ్రాయింగ్ తదితర పోటీలు నిర్వహించి బహుమతులు అందజేస్తామన్నారు. ఆసక్తి కలిగిన 15 నుంచి 29 సంవత్సరాల లోపు యువత ఈ కార్యక్రమంలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. ఆరోజు ఉదయం 9 గంటలకు పురమందిరం వద్దకు చేరుకుని తమ పేర్లు నమోదు చేసుకోవాలని కోరారు. వివరాలకు 99635 33440 నంబర్లో సంప్రదించాలని కోరారు.

ప్రైవేట్ ప్రత్యేక దోపిడీ

- 9 నుంచి 19 వరకు పాఠశాలలు, కళాశాలలకు హాలిడేస్
- హైదరాబాద్, బెంగళూరు నుంచి సొంతూళ్లకు క్యూ
- పండగ పేరుతో మూడు రెట్లు చార్జీల పెంచేసిన ప్రైవేట్ ట్రావెల్స్
- చోద్యం చూస్తున్న రవాణా శాఖ అధికారులు

➡ సంక్రాంతికి వరుసగా ఉద్యోగులకు 5 రోజుల సెలవులు

సంక్రాంతి పండుగకు 'ప్రత్యేక' సర్వీసుల పేరుతో ప్రైవేట్ ట్రావెల్స్ అధికారికంగానే దోపిడీకి పాల్పడుతున్నాయి. పండగలు, సెలవు రోజుల్లో ఆన్‌లైన్, ఆఫ్‌లైన్‌లోనైనా ఫిక్స్‌డ్ చార్జీలే ఉండాలనే రవాణా శాఖ నిబంధనను ట్రావెల్స్ యాజమాన్యం డోంట్ కేర్ అంటోంది. బహిరంగంగా వెబ్‌సైట్‌లో టికెట్ ధరలు నిర్ణయించినా.. దానిపై కూడా అధికంగా వసూలు చేస్తున్నా.. రవాణా శాఖాధికారులకు తెలిసినా.. మిన్నకుండిపోవడంపై ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి.

నెల్లూరు (టౌన్): సంక్రాంతి పండగకు సొంతూర్లకు రావడానికి జిల్లా ప్రజలకు ట్రావెల్స్ యాజమానులు చుక్కలు చూపిస్తున్నారు. పండగ పేరుతో దర్జాగా వెబ్‌సైట్‌లోనే ధరలు పెట్టి దోపిడీ చేస్తున్నారు. సాధారణ చార్జీల కంటే రెండు నుంచి మూడు రెట్లు చార్జీలు ఆయా వెబ్‌సైట్‌ల్లో పొందుపరిచారు. హైదరాబాద్, బెంగళూరు తదితర నగరాల్లో ఉద్యోగాల కోసం వెళ్లిన స్థానికులు నెల ముందుగానే టికెట్లు బుక్ చేసుకుందామనుకుంటే భారీగా పెంచిన చార్జీలే ఉన్నాయి. వెబ్‌సైట్‌ల్లో అధిక చార్జీలు కనిపిస్తున్నా.. రాష్ట్ర ప్రభుత్వం నోరు మెదపక పోవడంపై ప్రయాణికులు మండి పడుతున్నారు. తిరుగు ప్రయాణంలోనూ ఇదే పరిస్థితి కనిపిస్తోంది. ఒక కుటుంబం సొంతూరికి వచ్చిపోవాలంటే.. రూ.20 వేల వరకు చార్జీలకే చెల్లించాల్సిన పరిస్థితి ఏర్పడింది. పోనీ చార్జీలు పెంచలేదని ఆర్టీసీ బస్సుల్లో వెళదామనుకున్నా సరిపడా బస్సులను రాష్ట్ర ప్రభుత్వం తిప్పడం లేదు.

పండగలకు వరుస సెలవులు

జిల్లా నుంచి, ఇతర ప్రాంతాల నుంచి ప్రతి రోజూ సుమారు 150కు పైగా ట్రావెల్స్ బస్సులు తిరుగుతున్నాయి. 13న సోమవారం భోగి, 14న సంక్రాంతి, 15న కనుమ పండగ వచ్చింది. 11వ తేదీ రెండో శనివారం, 12న ఆదివారం కావడంతో ఉద్యోగులకు వరుసగా ఐదు రోజులు సెలవులొచ్చాయి. ఈ నెల 9



ప్రైవేట్ ట్రావెల్స్ బస్సులు

నుంచి 19వ తేదీ వరకు తెలంగాణ, కర్ణాటక రాష్ట్రాల్లో సంక్రాంతి సెలవులిచ్చారు. అదే సాఫ్ట్‌వేర్ రంగంలో గురు, శుక్రవారాల్లో సెలవు పెట్టుకుంటే వరుసగా 9 రోజులు కలిసొస్తాయి. ఈ రీతిలో ఉద్యోగులు, విద్యార్థులకు వరుస సెలవులు రావడంతో సంక్రాంతి పండగకు తమ సొంతూళ్లకు వచ్చేందుకు హైదరాబాద్, బెంగళూరు. చెన్నై, వైజాగ్ తదితర ప్రాంతాల్లో బస్టాండ్లు, రైల్వేస్టేషన్లు కిటకిటలాడుతున్నాయి.

రెండు నుంచి మూడు రెట్ల పెంపు

సంక్రాంతి పండగ పేరుతో ప్రైవేట్ ట్రావెల్స్ యాజమాన్యాలు సాధారణ చార్జీల కంటే అదనంగా రెండు నుంచి మూడు రెట్లు పెంచాయి. జిల్లా నుంచి హైదరాబాద్, బెంగళూరు, చెన్నై, వైజాగ్ నుంచి నెల్లూరు జిల్లాకు ప్రతి రోజు 150కుపైగా బస్సులు తిరుగుతుంటాయి. పండుగ పేరుతో ఈ నెల 10, 11 తేదీల్లో అమాంతం చార్జీల పెంచారు. పండగ తరువాత తిరిగి వెళ్లాలంటే 15 నుంచి 19వ తేదీ ఆదివారం వరకు అదే ధరలు ఉన్నాయి. టికెట్ కోసం వెబ్‌సైట్ ఓపెన్ చేస్తే ఒక చార్జీ ఉంటుందని, తీరా బుకింగ్ చేసుకుందామని క్లిక్ చేస్తే మరో చార్జీ కనబడుతుందని ప్రయాణికులు వాపోతున్నారు.

పెంచిన చార్జీలను ఒకసారి పరిశీలిస్తే..

ప్రాంతం	ఏసీ స్లీపర్	నాన్ ఏసీ స్లీపర్	నాన్ ఏసీ
	సాధారణ - పెరిగిన ధర	సాధారణ - పెరిగిన ధర	సాధారణ - పెరిగిన ధర
హైదరాబాద్	రూ.1,600 - రూ.4,934	రూ.1,000 - రూ.2,800	రూ. 850 - రూ.2,100
బెంగళూరు	రూ. 1,000 - రూ.2,600	రూ. 900 - రూ.2,200	రూ. 800 - రూ.1,900
వైజాగ్	రూ. 1,700 - రూ. 3,100	రూ. 1,100 - రూ.2,350	-------------

అధిక చార్జీలు వసూలు చేస్తే కఠిన చర్యలు

సంక్రాంతి పేరు చెప్పి ప్రైవేట్ యాజమాన్యాలు అధిక చార్జీలు వసూలు చేస్తే కఠిన చర్యలు తీసుకుంటాం. రెండు రోజుల్లో జిల్లా వ్యాప్తంగా రవాణా అధికారులతో మూడు బృందాలను ఏర్పాటు చేస్తాం. జాతీయ రహదారిపై ప్రతి రోజూ తనిఖీలు చేపడతాం. అధిక చార్జీలు వసూలు చేశారని ప్రయాణికులు ఫిర్యాదు చేస్తే ఆ బస్సు యాజమాన్యంపై ప్రభుత్వ నిబంధనల ప్రకారం కేసు నమోదు చేసి సీజ్ చేస్తాం. సాధారణ చార్జీల కంటే అదనంగా వసూలు చేయరాదు.

– బి.చందర్, డీటీసీ, రవాణా శాఖ

మొక్కుబడిగా తనిఖీలు

ట్రావెల్స్ బస్సులపై జిల్లా రవాణా శాఖ అధికారులు మొక్కుబడి తనిఖీలు నిర్వహిస్తున్నారన్న విమర్శలున్నాయి. బస్సు చార్జీలను అమాంతంగా పెంచి నేరుగా వెబ్‌సైట్‌ల్లో పెట్టినా వారిపై చర్యలు ఎందుకు తీసుకోలేక పోతున్నారని ప్రశ్నిస్తున్నారు. ప్రైవేట్ ట్రావెల్స్ యాజమాన్యాలు చేస్తున్న చార్జీల దోపిడీపై కూడా రాష్ట్ర ప్రభుత్వ పెద్దలు మిన్నకుండడంపై పలువురు మండి పడుతున్నారు.

ఉపాధి పనులపై దృష్టి పెట్టండి

- సకాలంలో లక్ష్యాలు పూర్తిచేయండి
- వీడియో కాన్ఫరెన్స్‌లో కలెక్టర్ ఆనంద్

నెల్లూరు రూరల్: లక్ష పనిదినాలు లక్ష్యంగా ఉపాధి హామీ పనులపై ప్రత్యేక దృష్టి పెట్టాలని కలెక్టర్ ఆనంద్ సంబంధిత అధికారులను ఆదేశించారు. సోమవారం సాయంత్రం కలెక్టరేట్‌లోని ఎస్ఆర్ శంకరన్ హాల్‌లో ఉపాధిహామీ, ఆర్‌డబ్ల్యుయెస్, హౌసింగ్, పంచాయతీరాజ్, సీసీ రోడ్ల గ్రౌండింగ్, ఎంఎస్ఎంఈ సర్వే, ఎస్టీలకు ఆధార్ కార్డుల జారీ, పీఎం సూర్యఘర్ యోజన అమలు మొదలైన అంశాలపై సబ్ కలెక్టర్లు, ఆర్డీఓలు, మున్సిపల్ కమిషనర్లు, ఎంపీడీఓలు, తహసీల్దార్లతో కలెక్టర్ వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఉపాధిహామీ కింద సీసీరోడ్లు, క్యాటిల్ షెడ్ల నిర్మాణ పనులను ముమ్మరంగా చేపట్టాలన్నారు. హౌసింగ్ అధికారులు ఇళ్ల నిర్మాణాలపై ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు. పంచా



మాట్లాడుతున్న కలెక్టర్ ఆనంద్

యతీరాజ్ ఆధ్వర్యంలో గ్రామాల్లో సీసీ రోడ్లను త్వరగా పూర్తి చేసేందుకు చర్యలు చేపట్టాలని, అలాగే సిమెంటు రోడ్ల నిర్మాణాలకు అనుమతులు ఇచ్చినా కూడా ఇంకా మొదలుపెట్టని అధికారులపై చర్యలు తీసుకుంటామన్నారు. వీసీలో జాయింట్ కలెక్టర్ కె కార్తీక్, డీఆర్ఓ ఉదయభాస్కర్, జిల్లా పంచాయతీ అధికారి శ్రీధర్‌రెడ్డి, జెడ్పీ డిప్యూటీ సీఈఓ మోహన్‌రావు, హౌసింగ్, డ్వామా, డీఆర్‌డీఏ పీడీలు డీఈఓ బాలాజీరావు, సమగ్ర శిక్ష ఏపీసీ వెంకటసుబ్బయ్య తదితరులు పాల్గొన్నారు.

వెంకట శేషయ్యది అక్రమ అరెస్ట్



ఏఎస్పీకి వినతిపత్రం అందజేస్తున్న మందల రాజేశ్వరమ్మ, కాకాణి



విలేకరులతో మాట్లాడుతున్న కాకాణి, రాజేశ్వరమ్మ, ఎమ్మెల్సీ చంద్రశేఖరరెడ్డి


- నిష్పక్షపాతంగా విచారణ జరిపించాలి
- ఏఎస్పీకి వైఎస్సార్‌సీపీ నేతల వినతి
- పక్కా ఆధారాలతో పోలీసులపై ప్రైవేట్ కేసు పెడతాం: కాకాణి

నెల్లూరు (క్రైమ్): వైఎస్సార్‌సీపీ జిల్లా ఉపాధ్యక్షుడు, వెంకటాచలం జెడ్పీటీసీ మాజీ సభ్యుడు మందల వెంకటశేషయ్యపై తప్పుడు కేసు బనాయించి అక్రమంగా అరెస్ట్ చేశారు. ఈ ఘటనపై నిష్పక్షపాతంగా విచారణ జరిపి తగిన చర్యలు తీసుకోవాలని కోరుతూ సోమవారం వెంకటశేషయ్య సతీమణి రాజేశ్వరమ్మ మాజీ మంత్రి, వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు కాకాణి గోవర్ధన్‌రెడ్డి, ఎమ్మెల్సీ పర్వతరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి తదితరులతో కలిసి జిల్లా పోలీసు కార్యాలయంలో ఏఎస్పీ సీహెచ్ సౌజన్యకు వినతి పత్రం అందజేశారు. తప్పుడు కేసుకు సంబంధించిన ఆధారాలు ఏఎస్పీకి అందజేశారు. కాకాణి గోవర్ధన్‌రెడ్డి మాట్లాడుతూ వెంకటాచలం పోలీసులు శ్రావణి ఫిర్యాదు మేరకు వెంకట శేషయ్యపై కేసు నమోదు చేసి మేజిస్ట్రేట్ ముందు హాజరుపరచగా సరైన ఆధారాలు లేవని రిమాండ్ రిపోర్టును తిరస్కరించారన్నారు. అయితే ఇన్‌స్పెక్టర్ సుబ్బారావు వెంకట శేషయ్యను వెంకటాచలంలోని శ్రావణి అత్తమామల ఇంటికి తీసుకెళ్లి, శ్రావణి మామ పెంచలయ్య రెండు రూ.50 విలువ కలిగిన, శ్రావణి సంతకంతో కూడిన ఖాళీ స్టాంపు పేపర్లను తనకు అందించాడని తప్పుడు స్వాధీనం మహజరునామా తయారుచేసి రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ అక్కడికి రాకుండానే వచ్చినట్టు సంతకం చేసి మోసపూరితంగా తయారుచేసి కోర్టుకు సమర్పించారన్నారు. దాని ఆధారంగానే వెంకటశేషయ్య రిమాండ్‌కు వెళ్లారన్నారు. ఎమ్మెల్యే సోమిరెడ్డి వెంకటాచలం ఇన్‌స్పెక్టర్ సుబ్బారావును అడ్డం పెట్టుకుని కక్ష సాధింపు చర్యలకు పాల్పడుతున్నారని ఆరోపించారు. శ్రావణి అనే మహిళతో తప్పుడు ఫిర్యాదు చేయించి అక్రమ కేసు బనాయించి అరెస్ట్ చేశారన్నారు.

ఈ వ్యవహారంలో ఎవరినీ వదలం

తప్పుడు స్టాంపు పేపర్లు సృష్టించి, కోర్టును తప్పుదోవ పట్టించిన వారందరూ శాశ్వతంగా ఉద్యోగాలు కోల్పోవడంతోపాటు జైలుకు వెళ్లడం ఖాయమన్నారు. ఈ మొత్తం వ్యవహారంపై ఎస్పీ నిష్పక్షపాతంగా విచారణ జరిపి బాధ్యులపై చర్యలు తీసుకోవాలన్నారు. లేనిపక్షంలో న్యాయస్థానాన్ని ఆశ్రయిస్తామని చెప్పారు. ఎమ్మెల్సీ పర్వతరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి మాట్లాడుతూ వెంకటశేషయ్య ఘటనపై పోలీసు అధికారులు నిష్పక్షపాతంగా విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని కోరారు.

హెచ్‌ఎంపీ వైరస్ కలకలం



▶▶ కర్ణాటకలో రెండు కేసులు నమోదు

- గుజరాత్‌లో మరో కేసు
- పసిపిల్లలే బాధితులు
- కరోనాను పోలిన వైరస్
- ముందు జాగ్రత్త చర్యలే రక్ష



నెల్లూరు (అర్బన్): చైనా దేశంలో కల్లోలం సృష్టిస్తున్న హ్యూమన్ మెటాప్ న్యూమో వైరస్ (హెచ్‌ఎంపీవీ) భారత్‌లోనూ తన ప్రభావాన్ని చూపిస్తోంది. గుజరాత్‌లో ఒక కేసు, పొరుగు రాష్ట్రమైన కర్ణాటకలో మరో రెండు కేసులు వెలుగు చూశాయి. వీటిని హెచ్‌ఎంపీవీగా ఐసీఎంఆర్ ధ్రువీకరించడంతో అప్రమత్తమైన కేంద్ర వైద్య, ఆరోగ్య శాఖ ఆ రాష్ట్రాలను అప్రమత్తం చేసింది. తగు జాగ్రత్త చర్యలు చేపట్టాలని సూచించింది. నిర్లక్ష్యం వహిస్తే నిండుప్రాణాలు బలైపోతాయని హెచ్చరించింది. ఈ వైరస్ ప్రభావం కరోనా వలే వేగంగా వ్యాపించే అవకాశం ఉండడంతో నెల్లూరు జిల్లా ప్రజలు సైతం ఆందోళన చెందుతున్నారు.

చలికాలంలో సహజంగానే దగ్గు, జలుబు, గొంతునొప్పి, జ్వరం కేసులు పెరుగుతున్నాయి. అలాంటి లక్షణాలతోనే హెచ్‌ఎంపీవీ సోకుతోంది. నిర్లక్ష్యం చేస్తే ఈ వ్యాధి న్యూమోనియాగా, బ్రాంకైటిస్‌గా మారి ప్రాణాలను హరించివేసే అవకాశం ఉంది. అందువల్లనే ప్రజలు ఆందోళన చెందుతున్నారు.

వ్యాధి నిరోధక శక్తి తక్కువ ఉన్నవారికే..

ఈ వైరస్ ప్రధానంగా వ్యాధినిరోధక శక్తి తక్కువగా ఉన్న పిల్లల్లో, వృద్ధుల్లో ఎక్కువగా సంక్రమిస్తుంది. మూడు నుంచి ఆరు రోజుల లోపల దగ్గు, జలుబు, జ్వరం, గొంతు నొప్పి లాంటి లక్షణాలతో ఈ వ్యాధి వెలుగు చూస్తుంది. ముక్కు నుంచి స్రావాలు కారడం జరుగుతుంది. తుమ్ములు, దగ్గు, తుంపర్ల ద్వారా వైరస్ ఒకరి నుంచి ఒకరికి వ్యాపిస్తుంది. వైరస్ సోకిన వారితో సన్నిహితంగా మెలగడం, బాధితులను తాకి ఆ చేతులతో ముక్కు, కళ్లు, నోటిని తాకడం ద్వారా ఈ వ్యాధి వ్యాప్తి చెందుతుంది.

➡ ప్రస్తుతానికి దేశంలో హెచ్‌ఎంపీవీ కేసులు చిన్న పిల్లల్లోనే వెలుగు చూశాయి. వీరు అంతర్జాతీయంగా ప్రయాణం చేయలేదు. అయినా వీరికి చైనాలో వెలుగు చూసిన వైరస్ ఇక్కడ రావడం అంటే ఆ దేశాల నుంచి ప్రయాణించిన వారి ద్వారా ప్రత్యక్షంగా గానీ, పరోక్షంగా గానీ జబ్బు వచ్చి ఉండవచ్చని డాక్టర్లు పేర్కొంటున్నారు.

రక్షించుకోవడం ఎలాగంటే..



హెచ్‌ఎంపీ వైరస్ బారిన పడకుండా ఉండాలంటే ప్రజలు ఈ వ్యాధిపై అవగాహన పెంచుకుని జాగ్రత్తలు తీసుకోవాలని వైద్యశాఖ వర్గాలు పేర్కొంటున్నాయి. ప్రధానంగా బయటకు వెళ్లేటప్పుడు మాస్క్ ధరించాలి. షేక్‌హ్యాండ్ ఇవ్వకూడదు. చేతులను తరచూ 30 సెకన్లపాటు సబ్బుతో కడుక్కోవాలి. వైరస్ సోకిన వారికి దూరంగా ఉండాలి. రద్దీ ఉండే ప్రాంతాల్లోకి పిల్లలను తీసుకుపోరాదు. షెడ్యూలు ప్రకారం వ్యాక్సినేషన్ వేయించాలి. పిల్లలకు వ్యక్తిగత పరిశుభ్రతను అలవాటు చేయాలి.

ఏం చేయాలంటే..

ఏదైనా వ్యాధి వస్తే తట్టుకునే వ్యాధి నిరోధక శక్తి పెరిగేందుకు ప్రధానంగా నారింజ, నిమ్మ, ద్రాక్ష, పచ్చటి ఆకుకూరలు ఆహారంగా తీసుకోవాలి. వెల్లుల్లి, అల్లం ఉపయోగించాలి. డ్రై ఫ్రూట్స్ ఆహారంగా తీసుకోవాలి. తద్వారా వ్యాధి నిరోధక శక్తిని పెంచుకోవచ్చు.

జిల్లా వైద్యశాఖకు సూచనలు

హెచ్‌ఎంపీ వైరస్ పట్ల అప్రమత్తంగా ఉండాలని రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖాధికారులు జిల్లా వైద్యశాఖకు తగు సూచనలు చేశారు. దీంతో డీఎంఅండ్‌హెచ్ఓ డాక్టర్ సుజాత జిల్లా కలెక్టర్‌తో సమావేశమయ్యారు. తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి చర్చించారు.

భయపడాల్సిన అవసరం లేదు



జిల్లాలో ప్రస్తుతానికి హెచ్‌ఎంపీ వైరస్ కేసులు లేవు. ఈ వైరస్ సోకినప్పటికీ భయపడాల్సిన పనిలేదు. జ్వరం, జలుబు, దగ్గు, గొంతునొప్పి, శ్వాస ఇబ్బందులు వంటి లక్షణాలు కనిపిస్తే సొంత వైద్యం చేయకుండా సమీప డాక్టర్‌ను సంప్రదించి వైద్య సేవలు పొందాలి. వారం రోజుల్లో జబ్బు తగ్గిపోయే అవకాశం ఉంది. ఫ్లూ వైరస్ లాగానే ఈ వైరస్‌లో కూడా సాధారణ లక్షణాలు కనిపిస్తాయి. పిల్లల మీద ప్రభావం చూపే అవకాశం ఉన్నందున తల్లిదండ్రులు జాగ్రత్తలు తీసుకోవాలి. వైద్యశాఖ పక్షాన అప్రమత్తంగా ఉండి అవసరమైతే ప్రత్యేక వార్డును ఏర్పాటు చేస్తాం.

– డాక్టర్ వి.సుజాత, జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ అధికారిణి

పక్కాగా ఆరోగ్య పెన్షన్ల పరిశీలన



మాట్లాడుతున్న పీడీ నాగరాజకుమారి

నెల్లూరు (పొగతోట): వైద్య, ఆరోగ్య శాఖకు సంబంధించిన హెల్త్ పెన్షన్ల పరిశీలన పక్కాగా నిర్వహించేలా చర్యలు తీసుకోవాలని డీఆర్‌డీఏ పీడీ నాగరాజకుమారి అధికారులను ఆదేశించారు. సోమవారం డీఆర్‌డీఏ కార్యాలయంలో పెన్షన్ల పరిశీలనకు నియమించిన అధికారులు, డాక్టర్లతో నిర్వహించిన సమావేశంలో పీడీ మాట్లాడారు. జిల్లా వ్యాప్తంగా 1,274 హెల్త్ పెన్షన్లు ప్రతినెలా పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. దీనికి సంబంధించి ప్రభుత్వ ఆదేశాల మేరకు పెన్షన్ అందుకుంటున్న ప్రతి లబ్ధిదారుడి ఇంటికి వెళ్లి పూర్తిస్థాయిలో పరిశీలించి, అనంతరం అర్హులు, అనర్హుల వివరాలను అందచేయాలన్నారు. నగరంలోని ఏసీ నగర్, రామ్‌నగర్ సచివాలయాల పరిధిలో హెల్త్ పెన్షన్ అందుకుంటున్న లబ్ధిదారుల ఇళ్లకు పీడీ వెళ్లి పరిశీలించారు.

ప్రజా సేవే ముఖ్యం

- మాజీ సీఎం కిరణ్‌కుమార్‌రెడ్డి



నెల్లూరు రూరల్: పదవి ఉన్నా లేకపోయినా ప్రజా సేవ ముఖ్యమని, పదవులు రావడం పోవడం నుదిటి రాత అని మాజీ ముఖ్యమంత్రి నల్లారి కిరణ్‌కుమార్‌రెడ్డి అన్నారు. సోమవారం నెల్లూరులోని బీజేపీ జిల్లా కార్యాలయంలో విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. తనకు ఎమ్మెల్సీ ఇవ్వబోతున్నారనే ప్రచారాన్ని ఖండించారు. జీవితంలో ఏ పదవీ శాశ్వతం కాదని, మాజీ అనేది మాత్రమే శాశ్వతమని చమత్కరించారు.

కాలువలో స్కూల్ బస్సు బోల్తా



కాలువలో బోల్తా పడిన స్కూల్ బస్సు

- అందులో 25 మంది విద్యార్థులు
- వెంటనే బయటకు తీసిన స్థానికులు
- త్రుటిలో తప్పిన పెను ప్రమాదం

బుచ్చిరెడ్డిపాళెం: బుచ్చిరెడ్డిపాళెం మండలంలోని సాల్మాన్‌పురం – మినగల్లు రోడ్డులో సోమవారం ఉదయం ఓ ప్రైవేట్ స్కూల్ బస్సు కాలువలో పడింది. అందులోని 25 మంది విద్యార్థులు ప్రమాదం నుంచి బయటపడ్డారు. స్థానికుల కథనం మేరకు.. నెల్లూరు రూరల్లోని దొడ్ల డెయిరీ పక్కనే గల శ్రీనికేతన్ ఇంగ్లిష్ మీడియం స్కూల్‌కు ప్రతి రోజూ సమీపంలోని జొన్నవాడ, మినగల్లు, పంచేడు, సాల్మాన్‌పురం గ్రామాల్లోని పిల్లలు బస్సులో వెళ్తుంటారు. సోమవారం ఉదయం కూడా బస్సు మినగల్లు నుంచి సాల్మాన్‌పురం వస్తున్న సమయంలో రోడ్లు గతుకులుగా ఉండటంతో బ్రేక్ ఫెయిలై పక్కనే ఉన్న పారుదల కాలువలోకి బోల్తా పడింది. దీంతో విద్యార్థులు గట్టిగా కేకలు వేయడంతోపాటు ఏడ్చేశారు. అప్రమత్తమైన బస్సులోని డ్రైవర్, క్లీనర్‌లతోపాటు పొలం పనులు కోసం వచ్చిన స్థానికులు కూడా సహాయం చేసి విద్యార్థులను వెలుపలికి తీశారు. క్రాంతి సందేష్ అనే విద్యార్థికి మాత్రం బలమైన గాయమైంది. మిగిలిన వారు స్వల్ప గాయాలతో బయటపడ్డారు.



గాయపడిన విద్యార్థి క్రాంతి సందేష్‌ను పరామర్శిస్తున్న ఎంఈఓ

గతుకుల రోడ్డే కారణమా?

ఆ రోడ్డు గతుకులమయం కావడంతోనే ఈ ప్రమాదం సంభవించినట్లు ప్రత్యక్ష సాక్షులు పేర్కొన్నారు. రోడ్డు స్థలాన్ని ఆక్రమించి పంట కాలువను ఏర్పాటు చేయడం వల్ల తరచూ ఈ ప్రాంతంలో ప్రమాదాలు జరుగుతున్నాయని స్థానికులు పేర్కొన్నారు. ప్రమాద విషయం తెలిసి తల్లిదండ్రులు ఘటనా స్థలానికి చేరుకున్నారు. అలాగే మండల విద్యాశాఖాధికారి వెంకటరత్నం విచ్చేసి గాయపడిన విద్యార్థులను వైద్యశాలలకు తరలించారు. మిగిలిన వారిని వారి తల్లిదండ్రులు ఇళ్లకు తీసుకెళ్లారు. మొత్తం మీద ఎలాంటి ప్రాణనష్టం జరగకపోవడంతో ఊపిరి పీల్చుకున్నారు.

నువ్వా.. నేనా..

ఎంతో ఇష్టం



మా నాన్న మహబూబ్ బాషా ఆటో డ్రైవర్. అన్న అబ్దుల్ రెహమాన్ క్యారమ్స్ ఆడుతుండేవాడు. అది చూసి ఆరో ఏట నుంచి ఆడుతున్నా. ఇప్పుడు డిగ్రీ మొదటి సంవత్సరానికి వచ్చాను. జిల్లాస్థాయి, రాష్ట్ర స్థాయి, జాతీయ స్థాయిల్లో ప్రతిభ చూపా. 2024 యూఎస్ఏలో వరల్డ్ చాంపియన్‌షిప్ సాధించాను. తమిళనాడు ప్రభుత్వం రూ.కోటి ప్రోత్సాహక బహుమతిని అందించింది. ఉద్యోగం సాధించి మా కుటుంబాన్ని బాగా చూసుకోవాలని అనుకుంటున్నా. అంతర్జాతీయ స్థాయిలో పేరు సాధిస్తా. – కాశీమా

- కొనసాగుతున్న క్యారమ్స్ పోటీలు

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట): జాతీయ క్యారమ్ ఫెడరేషన్, రాష్ట్ర క్యారమ్ ఫెడరేషన్ సంయుక్తంగా నెల్లూరులో నిర్వహిస్తున్న 29వ ఆలిండియా ఫెడరేషన్ క్యారమ్ టోర్నమెంట్ 2024 – 25 పోటీలు క్వార్టర్ ఫైనల్స్‌కు చేరుకున్నాయి. సోమవారం నెల్లూరు క్లబ్‌లో పోటీలు నువ్వా.. నేనా అన్నట్టుగా సాగాయి.

ఫలితాలు..

పురుషుల విభాగంలో..

పురుషుల డబుల్ ప్రీ క్వార్టర్ ఫైనల్స్‌లో యూపీకి చెందిన ఎండీ ఆరిఫ్ – అర్షదుల్లా ఖాన్, మహారాష్ట్రకు చెందిన వికాస్ హరీష్ – పంకజ్ పవార్, అసోంకు చెందిన ప్రీకర్ సింగ్ – ముజీబ్ అల్ రెహ్మాన్, జైన్ ఇరిగేషన్‌కు చెందిన సందీప్, అహ్మద్ ఫరూఖ్, ఆర్‌బీఐకు చెందిన జహీర్‌పాషా – ప్రకాష్‌మోర్, అసోంకు చెందిన జుగల్ కిశోర్ దత్తా – దబజోధి, జైన్ ఇరిగేషన్‌కు చెందిన రహీం కరీంఖాన్ – అభిజిత్ త్రిపాంకర్, ఎస్‌బీఐకి చెందిన కె.శ్రీనివాస్, గుఫ్రాన్‌లు ప్రవేశించారు.

మహిళా విభాగంలో..

పీఎస్‌బీకి చెందిన రష్మీకుమారి – ఇళవళగి, జైన్ ఇరిగేషన్‌కు చెందిన సమృద్ధి – శృతి, మహారాష్ట్రకు చెందిన కేసర్ రాజేష్ నిర్గన్ – మధుర్ మహేష్, తమిళనాడుకు చెందిన శోభిక – ప్రీతి, పీఎస్‌బీకి చెందిన ఖాజామియా – మిత్ర, ఏఏఐకు చెందిన షైనీ – బర్కత్ నిషా, పీఎస్‌పీబీకు చెందిన కాజల్ కుమారి – అకాంక్ష, సీసీసీఎస్‌బీకి చెందిన నాగజ్యోతి –నీలంఘాటీలు విజయం సాధించి క్వార్టర్ ఫైనల్స్‌లోకి ప్రవేశించారు. ఈ పోటీలను అంతర్జాతీయ క్యారమ్స్ ఫెడరేషన్ అధ్యక్షుడు జోసఫ్ మేయర్, రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ నీరజ్‌కుమార్ సంపతి, ప్రధాన కార్యదర్శి భారతి నాయర్, కోశాధికారి మదన్‌రాజ్, ఏపీ క్యారమ్స్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి ఎస్‌కే అబ్దుల్ జలీల్, ఫెడరేషన్ కప్ కో– చైర్మన్ మలిరెడ్డి కోటారెడ్డి, నెల్లూరు క్లబ్ కార్యదర్శి, టోర్నీ నిర్వాహక కార్యదర్శి పొన్నవోలు సుధాకర్‌రెడ్డి జిల్లా క్యారమ్స్ అసోసియేషన్ అధ్యక్షుడు సీహెచ్ శ్రీమన్నారాయణ, కార్యదర్శి రఘురామ్ శ్రీధర్, క్లబ్ కోశాధికారి విశ్వనాథ్ పర్యవేక్షించారు.



పోటీల్లో తలపడుతున్న క్రీడాకారులు

క్యారమ్స్‌కు ఉజ్వల భవిష్యత్



దేశంలో క్యారమ్స్‌కు ఉజ్వల భవిష్యత్ ఉంది. టోర్నమెంట్ల సంఖ్యను పెంచుతున్నాం. దీంతో ఎక్కువమంది క్రీడాకారులు ర్యాంకింగ్‌ను సాధించి అంతర్జాతీయ స్థాయిలో రాణించగలుగుతారు. ఇప్పటికే అంతర్జాతీయ స్థాయిలో చాలామంది క్రీడాకారులను రూపొందించిన ఘనత మనది. ఆంధ్రప్రదేశ్‌లో ఈ క్రీడ చాలా వేగంగా విస్తరిస్తోంది.

– రఖిబుల్ హుస్సేన్,
మెంబర్ ఆఫ్ పార్లమెంట్, ఆలిండియా
క్యారమ్ అసోసియేషన్ ప్రెసిడెంట్

ఉద్యోగావకాశాలు ఉన్నాయి



మహిళలకు క్యారమ్స్ క్రీడ అన్ని విధాలా సౌకర్యంగా ఉంటుంది. ఉద్యోగావకాశాలు ఉన్నాయి. ఇప్పటికే నాగజ్యోతి, ఖాజీమాలు వరల్డ్ చాంపియన్లుగా నిరూపించారు. ఇప్పుడు నెల్లూరులో, మార్చిలో ఢిల్లీలో జరిగే ర్యాంకింగ్ టోర్నమెంట్‌లో పాయింట్లను కలిపి అంతర్జాతీయ పోటీలకు అర్హతను నిర్ణయిస్తారు.

– భారతీ నారాయణ్,
ఆలిండియా క్యారమ్
ఫెడరేషన్ జనరల్ సెక్రటరీ

ఉద్యోగం వచ్చింది



క్యారమ్స్ క్రీడ వల్లే పోస్టల్ డిపార్ట్‌మెంట్‌లో ఉద్యోగం సాధించాను. ప్రస్తుతం తమిళనాడు నుంచి ఆడుతున్నాను. గతంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో కావలి హెడ్ పోస్టాఫీసులో పోస్టల్ అసిస్టెంగా పనిచేశాను. మా నాన్న రాజేంద్ర కూడా క్యారమ్స్ క్రీడాకారుడే. ప్రస్తుతం 3వ ర్యాంక్‌లో ఉన్నాను. స్పోర్ట్స్ కోటాలో ఉద్యోగం సాధించినా క్రీడపై ఉన్న మక్కువతో, ర్యాంకింగ్‌ను పెంచుకునే దిశగా పోటీల్లో పాల్గొంటున్నా.

– వినీత,
తమిళనాడు క్రీడాకారిణి,

నిర్విరామంగా ఆడాను



మాది గుంటూరు. మా కుటుంబ సభ్యులందరూ క్రీడాకారులే. నేను క్యారమ్స్‌పై మక్కువ పెంచుకున్నాను. 2014లో సబ్ జూనియర్ విభాగంలో నిర్విరామంగా 18 మంది ప్రత్యర్థులతో క్యారమ్స్ ఆడాను. అప్పుడు గిన్నిస్ బుక్ ఆఫ్ రికార్డుల్లోకి ఎక్కింది. 2016లో 27 మంది ప్రత్యర్థులతో క్యారమ్స్ ఆడి రికార్డును నెలకొల్పా. ఇప్పటి వరకు 51 రికార్డులు సాధించాను. దీనిని గుర్తించిన కాలిఫోర్నియాలోని బర్కిలీ యూనివర్సిటీ స్పోర్ట్స్‌లో డాక్టరేట్‌ను ప్రదానం చేసింది. ఏడు జాతీయ స్థాయి పోటీల్లో, మూడు సౌత్‌జోన్ పోటీల్లో ప్రతిభ చూపా. అంతర్జాతీయ పోటీల ర్యాంకింగ్ కోసం ఈ టోర్నీలో పాల్గొంటున్నాను.

– డాక్టర్ ఎస్‌కే హుస్నా సమీరా,
ఆంధ్ర రాష్ట్ర క్రీడాకారిణి

శరవేగంగా అభివృద్ధి



రాష్ట్రంలో క్యారమ్స్ క్రీడ శరవేగంగా అభివృద్ధి చెందుతోంది. రెండు ర్యాంకింగ్ టోర్నమెంట్లు, ఒక అంతర్జాతీయ పోటీలో పాల్గొంటే ప్రపంచ స్థాయి పోటీలకు అర్హత సాధించవచ్చు. ప్రస్తుతం నెల్లూరులో జరిగేవి మొదటి క్వాలిఫైయింగ్ పోటీలు. మార్చిలో ఢిల్లీలో జరిగే రెండో క్వాలిఫైయింగ్ పోటీల్లో వచ్చే పాయింట్లు ఆధారంగా టాప్ టెన్ జట్లను ఇంటర్నేషనల్ పోటీలకు ఎంపిక చేస్తాం. నేను 1991 నుంచి 2001 వరకు క్రీడాకారుడిగా, మేనేజర్ కోచ్‌గా, ఇంటర్నేషనల్ రెఫరీగా, ప్యానల్ కోచ్‌గా సేవలందించాను రెండోసారి రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా ఉన్నాను. నెల్లూరులో టోర్నమెంట్ నిర్వహణ బాగుంది.

– ఎస్‌కే అబ్దుల్ జలీల్, ఆంధ్ర రాష్ట్ర
క్యారమ్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి

తల్లికి వందనం పేరుతో మోసం

- కూటమి ప్రభుత్వంపై పీడీఎస్‌యూ మండిపాటు
- కలెక్టరేట్‌లో ‘ప్రజా సమస్యలపరిష్కార వేదిక’
- పెద్ద సంఖ్యలో తరలివచ్చిన అర్జీదారులు



కలెక్టర్ ఆనంద్‌కు వినతిపత్రం ఇస్తున్న పీడీఎస్‌యూ జిల్లా అధ్యక్షుడు సునీల్, నాయకులు

నెల్లూరు(అర్బన్): ‘ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు తల్లికి వందనం ఇవ్వకుండా కూటమి ప్రభుత్వం ప్రజలను మోసం చేసింది’ అని పీడీఎస్‌యూ నేతలు మండిపడ్డారు. సోమవారం నెల్లూరులోని కలెక్టరేట్‌లో ‘ప్రజా సమస్యల పరిష్కార వేదిక’ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా పీడీఎస్‌యూ జిల్లా అధ్యక్షుడు సునీల్, నాయకులు కలెక్టర్ ఆనంద్‌కు వినతిపత్రం ఇచ్చారు. సునీల్ మాట్లాడుతూ గత ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి అమ్మఒడి పేరుతో క్రమం తప్పకుండా ప్రతి సంవత్సరం నగదు అందించారన్నారు. అంతకన్నా ఎక్కువ ఇస్తానని, ఇంట్లో ఎంతమంది ఉంటే అంతమందికి తల్లికి వందనం వర్తింపజేస్తామని చెప్పిన చంద్రబాబు అధికారంలోకి వచ్చి ఏడునెలలైనా పట్టించుకోలేదన్నారు. ఇందువల్ల విద్యార్థులు పుస్తకాలు, ఇతర విద్యా సామగ్రి కొనుగోలు చేయలేక ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఇచ్చిన హామీని నిలబెట్టుకోకపోతే విద్యార్థి సంఘాలతో కలిసి రాష్ట్ర వ్యాప్తంగా ఆందోళనలను తీవ్రతరం చేస్తామన్నారు.

ఆలకించండి

అయ్యా మా సమస్యలు పరిష్కరించాలని మండల కేంద్రాల్లో తహసీల్దార్లు, ఎంపీడీఓల చుట్టూ కాళ్లరిగేలా పలుమార్లు తిరిగాం. అయినా ఉపయోగం లేదు. తప్పని పరిస్థితుల్లో వ్యయ, ప్రయాసలకోర్చి దూర ప్రాంతాల నుంచి కలెక్టరేట్ వచ్చాం. మీరైనా మా మొర ఆలకించి సమస్యలు పరిష్కరించాలని పలువురు ప్రజలు అధికారులకు మొర పెట్టుకున్నారు. ప్రజల నుంచి కలెక్టర్ ఆనంద్, జేసీ కార్తీక్, డీఆర్వో ఉదయభాస్కర్‌రావు, డీపీఓ శ్రీధర్‌రెడ్డి తదితరులు వినతులు స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ జిల్లా అధికారులతో నిర్వహించిన సమీక్షలో మాట్లాడుతూ అర్జీలను త్వరితగతిన పరిష్కరించాలని ఆదేశించారు.



అధికారులతో మాట్లాడుతున్న అర్జీదారులు

నష్టపరిహారం కోసం..



రామాయపట్నం పోర్టు కోసం కర్లపాళెంలోని ఇళ్లు, భూములిచ్చాం. పోర్టు మొదటి దశ పనులు పూర్తి కావొస్తున్నా మాకు ఇంకా నష్టపరిహారం ఇవ్వలేదు. బతుకుదెరువు లేక ఇబ్బందులు పడుతున్నాం. వెంటనే నష్టపరిహారం చెల్లించడంతో పాటు కరువు భత్యం, ప్రతి ఇంటికీ ఒక ఉద్యోగం కల్పించాలి. చేపల వేటకు అనుకూలంగా బోట్లు నిలిపేందుకు జెట్టీని ఏర్పాటు చేయాలి.

– బాలాజీ, సుబ్బులు, రఘుబాబు,
కర్లపాళెం గ్రామ నిర్వాసితులు

దివ్యాంగులకు రూ.5 లక్షల రుణాలివ్వాలి



దివ్యాంగులకు కేంద్ర ప్రభుత్వ నిధులతో జాతీయ ఆర్థిక అభివృద్ధి సంస్థ ద్వారా రూ.5 లక్షల వరకు రుణాలివ్వాలని ఏపీ దివ్యాంగుల కార్పొరేషన్ మేనేజింగ్ డైరెక్టర్ కార్యాలయం నుంచి ఉత్తర్వులు వచ్చాయి. అందుకు విరుద్ధంగా నెల్లూరు జిల్లా కార్పొరేషన్ మేనేజర్ వ్యవహరిస్తున్నారు. రూ.లక్ష వరకు మాత్రమే రుణాలిస్తామంటున్నారు. ఇది అన్యాయం. మాకు రూ.5 లక్షల రుణాలిచ్చి ఆదుకోవాలి.

– కాలేషా, నవ్యాంధ్ర వికలాంగుల
హక్కుల సేవా సమితి రాష్ట్ర అధ్యక్షుడు,
రాంబాబు, నాగరాజు, అమీనా తదితరులు

యువకుడి దారుణ హత్య

- స్వల్ప వివాదమే కారణం
- పోలీసుల అదుపులో పలువురు నిందితులు?



అభిషేక్ మృతదేహం



అభిషేక్ (ఫైల్)

నెల్లూరు(క్రైమ్): స్వల్ప వివాదం పెద్దదిగా మారి ఓ యువకుడి దారుణ హత్యకు దారి తీసింది. ఈ ఘటన నెల్లూరు కొండాయపాళెంలో జరిగింది. సోమవారం పోలీసులు వివరాలు వెల్లడించారు.. కొండాయపాళేనికి చెందిన గంట ఉదయ్ కుమార్, అభిషేక్ (23)లు అన్నదమ్ములు. అదే ప్రాంతానికి చెందిన దాసు వారికి దూరపు బంధువు. దాసు మద్యానికి బానిసయ్యాడు. మత్తులో ఇష్టానుసారం ప్రవర్తించేవాడు. అసభ్యకర పదజాలంతో దూషించేవాడు. ఆదివారం అర్ధరాత్రి దాటిన తర్వాత దాసు తన ఇంటికి సమీపంలో గట్టిగా కేకలు వేస్తుండటంతో ఉదయ్ వారించాడు. దీంతో వారి మధ్య మాటామాటా పెరిగి ఘర్షణకు దారి తీసింది. ఉదయ్ అతడిపై చేయి చేసుకోవడంతో దాసు వెళ్లిపోయాడు. జరిగిన విషయాన్ని పడారుపల్లిలో ఉంటున్న తన భార్య, అత్త, బావమరుదులు శ్రీకాంత్, శ్రీనివాసులు, స్నేహితుడు సూర్యకు చెప్పాడు. అందరూ కలిసి సోమవారం తెల్లవారుజామున కొండాయపాళేనికి చేరుకుని ఉదయ్‌తో ఘర్షణకు దిగారు. అక్కడే ఉన్న అభిషేక్, ఉదయ్ స్నేహితుడు ప్రవీణ్ అలియాస్ చింటూ అడ్డుకున్నారు. దీంతో మరింతగా రెచ్చిపోయిన వారు తమ వెంట తెచ్చుకున్న మారణాయుధాలతో విచక్షణారహితంగా ఈ ముగ్గురిపై దాడి చేసి పరారయ్యారు. ఈ ఘటనలో అభిషేక్‌కు తీవ్రగాయాలై మృతిచెందగా, ఉదయ్ స్వల్పంగా గాయపడ్డాడు. ప్రవీణ్‌కు తీవ్రగాయాలు కావడంతో ప్రస్తుతం నారాయణ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. సమాచారం అందుకున్న నగర డీఎస్పీ డి.శ్రీనివాసరెడ్డి, వేదాయపాళెం ఇన్‌స్పెక్టర్ వి.శ్రీనివాసరెడ్డిలు ఘటనా స్థలాన్ని పరిశీలించారు. ఉదయ్ ఫిర్యాదు మేరకు హత్య కేసు నమోదు చేశారు. మృతుడు ల్యాబ్ టెక్నీషియన్‌గా పనిచేస్తున్నాడు. పోలీసులు పలువురిని అదుపులోకి తీసుకుని విచారిస్తున్నట్లు సమాచారం.

నిమ్మ ధరలు (కిలో)

పెద్దవి : రూ.29
సన్నవి : రూ.23
పండ్లు : రూ.12



మద్యం మత్తులో..

- భార్యపై భర్త హత్యాయత్నం

సోమశిల: మద్యం మత్తులో భార్యపై భర్త హత్యాయత్నానికి పాల్పడిన ఘటన అనంతసాగరం మండల పరిధిలోని ఆమనిచిరువెల్ల గ్రామంలో సోమవారం జరిగింది. పోలీసుల కథనం మేరకు.. గ్రామానికి చెందిన షేక్ అహ్మద్‌బాషా మద్యం తాగుతూ కుటుంబసభ్యులతో రోజూ ఘర్షణకు పాల్పడుతున్నాడు. మత్తులో సోమవారం తన భార్యపై కత్తితో దాడి చేశాడు. ఆమె చేతికి బలమైన గాయమై అక్కడి నుంచి తప్పించుకుని అనంతసాగరం పోలీస్‌స్టేషన్‌లో భర్త మీద ఫిర్యాదు చేసింది. ఎస్సై సూర్యప్రకాష్‌రెడ్డి గ్రామానికి వెళ్లి విచారణ చేశారు. కేసు నమోదు చేసి అహ్మద్‌బాషాను అదుపులోకి తీసుకున్నారు.

జూనియర్ అసిస్టెంట్లకు పదోన్నతులు

నెల్లూరు(అర్బన్): రెవెన్యూ శాఖలో పనిచేస్తున్న 11 మంది జూనియర్ అసిస్టెంట్లకు సీనియర్ అసిస్టెంట్లుగా, ఆర్‌ఐలుగా పదోన్నతులు కల్పించి బదిలీ చేస్తూ కలెక్టర్ ఆనంద్ సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. షేక్ షైరాభాను, టి.శాంతిప్రియ, సీహెచ్ నరసింహారావు, షేక్ సల్మా, పి.రాంకుమారి, డి.శ్రీకాంత్, పి.మోహన్‌రూప, కె.ప్రదీప్‌కుమార్, వై.ప్రసాద్, వై.వంశీకృష్ణ, జి.దివాకర్ పదోన్నతి పొందిన వారిలో ఉన్నారు.

దేహదారుఢ్య పరీక్షలకు 338 మంది హాజరు

నెల్లూరు(క్రైమ్): నెల్లూరు పోలీస్ కవాతు మైదానంలో కానిస్టేబుల్ అభ్యర్థుల దేహదారుఢ్య పరీక్షలు కొనసాగుతున్నాయి. ఆరో రోజైన సోమవారం 600 మంది అభ్యర్థులకు గానూ 338 మంది హాజరయ్యారు. ధ్రువీకరణపత్రాల పరిశీలన, ఛాతి కొలతల నమోదు పూర్తి చేసుకున్న అనంతరం అభ్యర్థులకు 1,600, 100 మీటర్ల విభాగాల్లో పరుగు పందెం, లాంగ్ జంప్ పరీక్షలు నిర్వహించారు. ఈ ప్రక్రియను ఎస్పీ జి.కృష్ణకాంత్ పర్యవేక్షించారు.



పరుగు పందెంలో పాల్గొన్న అభ్యర్థులు

ఆస్తి కోసం చిత్రహింసలు



సమస్యలు తెలుసుకుంటున్న ఏఎస్పీ సౌజన్య

- పోలీసులకు వృద్ధురాలి ఫిర్యాదు

నెల్లూరు(క్రైమ్): ‘ఆస్తి కోసం నా చిన్న కుమారుడు చిత్రహింసలు పెడుతున్నాడు. నేను చనిపోయినట్లుగా నకిలీ పత్రాలు సృష్టించి ఆస్తి కాజేయాలని యత్నిస్తున్నాడు. విచారించి చర్యలు చేపట్టాలి’ అని పొదలకూరుకు చెందిన ఓ వృద్ధురాలు పోలీస్ ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేశారు. సోమవారం నెల్లూరులోని జిల్లా పోలీసు కార్యాలయంలో జరిగిన ప్రజా సమస్యల పరిష్కార వేదికకు 71 ఫిర్యాదులు అందాయి. వాటిని పరిశీలించిన ఏఎస్పీ సీహెచ్ సౌజన్య, నగర డీఎస్పీ డి.శ్రీనివాసరెడ్డిలు త్వరితగతిన పరిష్కరించాలని ఆయా ప్రాంత పోలీసు అధికారులను ఆదేశించారు.

- తన తల్లి ఆత్మహత్య ఘటనలో లోతుగా విచారణ జరిపి, కారకులపై చర్యలు తీసుకోవాలని నెల్లూరు నవాబుపేటకు చెందిన ఓ వ్యక్తి కోరారు.
- అత్తింటి వేధింపులపై పోలీసులు కేసు నమోదు చేశారు. కేసును ఉపసంహరించుకోవాలని, లేదంటే చంపుతామని కొందరు బెదిరిస్తున్నారని ఏఎస్‌పేటకు చెందిన ఓ మహిళ ఫిర్యాదు చేశారు.

హత్య కేసులో నిందితుల అరెస్ట్

కావలి: అల్లూరు మండలం నార్త్‌మోపూరు ఎస్సీ కాలనీకి చెందిన చేజర్ల కార్తీక్ (22) అనే యువకుడిని సుత్తితో కొట్టి హతమార్చిన ఘటనలో ఏడుగురు నిందితులను అదుపులోకి తీసుకున్నట్లు కావలి డీఎస్పీ పీ శ్రీధర్ తెలిపారు. పట్టణంలోని డీఎస్పీ కార్యాలయంలో సోమవారం ఆయన వివరాలు వెల్లడించారు. నార్త్‌మోపూరు ఎస్సీ కాలనీకి చెందిన కొందరు యువకులు నూతన సంవత్సర వేడుకల సందర్భంగా ఈనెల 1వ తేదీ వేకువన కేకలు వేస్తూ మోటార్‌బైక్‌లపై తిరుగుతున్నారు. అదే కాలనీకి చెందిన నిరంజన్ అనే వ్యక్తి వారిని ప్రశ్నించడంతో గొడవ జరిగింది. దీంతో నిరంజన్‌ను చంపాలని బైక్‌లపై రాడ్లు, సుత్తితో మళ్లీ వచ్చిన యువకులు దాడికి దిగుతుండగా అదే ప్రాంతానికి చెందిన కార్తీక్ సర్దిచెప్పబోయాడు. అప్పటికే మద్యం మత్తులో ఉన్న యువకులు కార్తీక్ తలపై సుత్తితో విచక్షణారహితంగా దాడి చేయడంతో తీవ్రంగా గాయపడ్డాడు. వెంటనే ఆస్పత్రికి తరలించినా ఫలితం లేకపోయింది. చికిత్స పొందుతూ అదేరోజు రాత్రి చనిపోయాడు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు విచారణ ముమ్మరం చేసి నిందితులను అరెస్ట్ చేశారు. నిందితులైన కొమ్మి సుధీర్, తుమ్మతాటి ఆదిత్య, కొమ్మి నరేష్, అరగల పోలు, కొమ్మి అహారాన్, అజ్జం హేమంత్ కుమార్, కోటపూడి జగదీష్‌లను అరెస్ట్ చేయగా ఏ7 అయిన మనోజ్ పరారీలో ఉన్నాడు. అతడి కోసం ప్రత్యేక బృందాలు ఏర్పాటు చేసి గాలిస్తున్నట్లు డీఎస్పీ వివరించారు.



మాట్లాడుతున్న డీఎస్పీ శ్రీధర్

నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్ ధరలు

బ్రాయిలర్ (లైవ్)	: 112	స్కిన్‌లెస్	: 224
లేయర్ (లైవ్)	: 85	లేయర్	
బ్రాయిలర్ చికెన్	: 204	చికెన్	: 145
బ్రాయిలర్			

